క్లుప్తంగా

కృత్రిమ అవయవాల పంపిణీ



బాలుడికి కృత్రిమ అవయవం అందించిన దృశ్యం

ఏలూరు రూరల్: దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్నామని దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం దొండపాడు పరివర్తన బధిరుల పాఠశాలలో కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీతో పాటు ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్‌థెరఫీ, డీఐడీ మొదలగు సేవలు అందిస్తున్నామన్నారు. అవసరమైన వారు సంప్రదించాలని కోరారు.

12, 13 తేదీల్లో అఖిల భారత ఆదివాసీ సదస్సు

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 2023 అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్), ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్టణంలో నిర్వహించే అఖిల భారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా ఒక ప్రకటనలో కోరారు. విశాఖ పట్టణం డాక్టర్ బీడీ శర్మ ప్రాంగణం(సుబ్బలక్ష్మి కల్యాణ మండపం, రైల్వే న్యూకాలనీ, విశాఖ పట్టణం)లో నిర్వహించే ఈ సదస్సులో ఆదివాసీలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): స్థానిక సుందరయ్య కాలనీలో నాలుగు రోజులుగా తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని సీపీఎం నగర కమిటీ పేర్కొంది. ప్రతి రెండు, మూడు నెలలకొకసారి కాలనీ ప్రజలకు ఈ సమస్య ఎదురవుతోందని తెలిపింది. పాత వెంకటాపురం పరిధిలో సుద్ద నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టి సారించి సుందరయ్య కాలనీ తాగునీటి సమస్య పరిష్కరించాలని, గోదావరి జలాల సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరింది.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): పెదవేగి మండలం అమ్మపాలెం, కొప్పాక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందనలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. దళితసేన ఏలూరు మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, జిల్లా కార్యదర్శి పింగుల ఇథియా పాల్గొన్నారు.

కులవివక్ష కొనసాగడం బాధాకరం



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్రం సిద్ధించి 76 సంవత్సరాలు కావస్తున్నా.. నేటికీ సమాజంలో కుల వివక్ష కొనసాగడం బాధాకరమని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. 1989 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలు చేసిన రోజును పురస్కరించుకుని స్థానిక నరసింహారావుపేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో భారత రాజ్యాంగం, ఎస్సీ, ఎస్టీ కులాల హక్కులు, ఉద్యోగులు అనే అంశంపై సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ మేరకు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం రాకముందు మనుధర్మ శాస్త్రం కులాన్ని సృష్టించి మనిషికి మనిషికీ మధ్య నిచ్చెన మెట్లు, వ్యవస్థల హెచ్చుతగ్గు విధానాన్ని అమలు చేసేవారని గుర్తుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్టికల్ 14 ప్రవేశ పెట్టి మానవులందరూ సమానమని చెప్పారని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనం నేరమన్నారు. 1955లో పౌరహక్కుల చట్టం, 1989లో అట్రాసిటీ చట్టం వచ్చినప్పటికీ వివక్షత కొనసాగుతూనే ఉందని వాపోయారు. ఈ వివక్షత పోవాలంటే దేశంలోని ప్రతి పౌరుడూ భారత రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యావంతులు, ఉద్యోగులు తమ హక్కులను కాపాడు కోవడంలో విఫలమవుతున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ యాక్ట్ వజ్రాయుధం వంటిదని వివరించారు. కొరబండి బాబూరావు, గారపాటి నాగేశ్వరరావు, పల్లా యేసేబు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా రెండోసారి
నెరుసు ఎంపికపై హర్షం



నెరుసు చిరంజీవిని అభినందిస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బీసీ నాయకుడు నెరుసు చిరంజీవికి మరోసారి అవకాశం కల్పించడం పట్ల నగరంలోని పలు బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం చిరంజీవి ఇంటి వద్ద ఆయన్ని కలిసి అభినందించారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని బ్యాక్ బోన్ అని చేతల్లో చూపుతోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ఆళ్ల నానిలకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీచైర్మన్‌గా ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును నియమించడం, ఇటీవల టీటీడీ బోర్డు సభ్యుల్లో ఏలూరుకు చెందిన నెరుసు నాగ సత్యంను నియమించడం, తాజాగా చిరంజీవికి రెండోసారి ఏఎంసీ పగ్గాలు అప్పగించడం ద్వారా ఆళ్ల నాని బీసీలకు అధిక గుర్తింపు ఇచ్చారని వివరించారు. ఏలూరు నియోజకవర్గంలో అనేక కుల సంఘాలకు స్థలాలు, నిధులు కేటాయించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్, ఆళ్ల నాని గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, తూర్పుకాపు సంఘం నాయకులు అబ్బిరెడ్డి రంగముత్యాలు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కింజంగి రాజు, నాగవంశీ సంఘం జిల్లా నాయకుడు బాయి వెంకట్రావు, బీసీ నాయకులు శ్రావణ్ కుమార్, ఆదిబాబు, ఎస్సీసెల్ నాయకుడు బండ్ల మూడి సునీల్, ఇదలాడ నాని తదితరులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు నివాళి



అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న డీఎఫ్ఓ, సిబ్బంది

ఏలూరు రూరల్: అటవీ సంరక్షణ కోసం ప్రాణాలర్పించిన అటవీశాఖ ఉద్యోగుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమని జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రధామ అన్నారు. సోమవారం అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏలూరులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అడవులు జాతి సంపదని, వాటి సంరక్షణ కోసం ఎందరో ఉద్యోగులు ప్రాణాలర్పించారని రవీంద్రదామ కొనియాడారు. అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. త్యాగధనుల స్ఫూర్తితో అడవుల సంరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. తొలుత అమరవీరుల శిలాఫలకం వద్ద జ్యోతి వెలిగించి, పూలుజల్లి నివాళులర్పించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌వీకే కుమార్, టెరిటోరియల్, వైల్డ్ లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ అందుతున్న ఆరోగ్య సేవలపై సర్వే



ఆగడాలలంకలో టీకాలపై ఆరా తీస్తున్న జిల్లా నోడల్ అధికారి సాగర్, హెల్త్ సిబ్బంది

భీమడోలు: ఆగడాలలంకలో ఇంటింటికీ అందుతున్న ఆరోగ్య సేవలపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే సోమవారం ముగిసింది. 8 మంది సభ్యుల కేంద్ర బృందం గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని ఆగడాలలంకలో పర్యటించి ఈ సర్వే నిర్వహించారు. వివిధ ఆరోగ్య సేవలు ప్రజలకు ఏ స్థాయిలో అందుతున్నాయనే వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వేలో సేకరించిన సమాచారం మేరకు ఆరోగ్య సేవలను నమోదు చేసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు టీకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. తల్లిదండ్రులకు టీకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పథకాలు పారదర్శకంగా, సక్రమంగా అందుతున్నదీ లేనిదీ లబ్ధిదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. వాటిన్నింటిని నివేదిక రూపంలో తయారీ చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని బృందం సభ్యులు పేర్కొన్నారు. నోడల్ అధికారుల బృందం సాగర్, కృష్ణారావు, మల్లేశ్వరీ, సుబ్బలక్ష్మీ, బేగ్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జిల్లా కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు సరిగా లేవన్నారు. నగరంలో కుక్కలు, పందుల సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ లింగరాజు, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమావేశాల కరపత్రం విడుదల

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమావేశాలు ఏలూరులో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సమావేశాల కరపత్రం విడుదల చేశారు. ముఖ్యఅతిథులుగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు షేక్ సాబ్జి, ఇళ్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మరో 300 మంది ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు, ఎస్ మహంకాళీరావు, సీహెచ్ మాధవ, కె.సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సమీక్ష

దెందులూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి బూత్ లెవెల్ ఆఫీసర్లు విధి నిర్వహణలో చేసే ప్రతి పని జవాబుదారీగా, అంకితభావంతో పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్‌లెవెల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఓటు కోసం వచ్చిన దరఖాస్తులు, మృతి చెందినవారి ఓటర్ల తొలగింపు, ఇతర గ్రామాలకు వెళ్లిపోయిన ఓటర్ల గుర్తింపు, ఆన్‌లైన్ వివరాలను మండలాల వారీగా తహసీల్దార్‌తో, గ్రామాల వారీగా బీఎల్వోలతో ఎన్నికల అధికారి సమీక్షించారు. నివేదికలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బీఎల్వోలు ఉన్నారు.

స్పందనకు వినతులు

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తుందని పెదవేగి తహసీల్దార్ ఎన్ నాగరాజు అన్నారు. మండల కేంద్రమైన పెదవేగి తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వారి సమస్యలను వినతుల రూపంలో అధికారులకు సమర్పించారు.

శారీరక, మానసికోల్లాసానికి ఆటలు దోహదం



రాట్నాలకుంటలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న కొఠారు

పెదవేగి : శారీరక, మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో సోమవారం రాత్రి నుంచి జరగనున్న వాలీబాల్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కాసేపు క్రీడాకారులతో కలిసి కొఠారు వాలీబాల్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, గరికిముక్కు సర్వేశ్వరరావు, జ్ఞానేసు, నిర్వాహకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయాలి



పెదపాడులో వ్యవసాయ సహాయకులకు శిక్షణ అందిస్తున్న పెదపాడు ఏఎస్ఓ ఆదినారాయణ

పెదపాడు: రైతులకు పంటలపై బీమా అందించేందుకు పంటకోత ప్రయోగమే ఆధారమని పెదపాడు మండల గణాంకాధికారి ఆదినారాయణ తెలిపారు. సోమవారం పంటకోత ప్రయోగం చేసే విధానంపై పెదపాడు వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ కార్యాలయంలో మండల గణాంకాధికారి ఆదినారాయణ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్, గణాంకాధికారి ఆదినారాయణ పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల వివరాలు పంటల బీమా యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. దీంతో పాటు పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈనెలాఖరులోగా పంటల నమోదు చేయించుకోవాలన్నారు. సహాయకులకు ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో మండలంలోని వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు

పెదవేగి : మండల వ్యాప్తంగా అండర్ 14, 17 బాలబాలికలకు ఆటల పోటీలు మంగళవారం, బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ బుద్ధవాస్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు కబడ్డీ, కోకో, వాలీబాల్, త్రోబాల్, షటిల్, టెన్నికాయిడ్, యోగ, ఆటల ఎంపికలు మండలస్థాయిలో మంగళవారం పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకులంలో, అథ్లెటిక్స్ పోటీలు బుధవారం కొప్పాక ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఇతర వివరాలకు మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్స్ ఎం మల్లికార్జున్, గురుమూర్తి-986607934, మోర్ల శ్రీనివాస్ 6300103545ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపిక వాయిదా

దెందులూరు: దెందులూరు మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా వేసినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణారావు తెలిపారు. ఈ నెల 12 నుంచి కొవ్వలి ఉన్నత జిల్లా పరిషత్ పాఠశాలలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించాల్సి ఉండని, వర్షాల కారణంగా వాయిదా వేశామన్నారు. దెందులూరు మండల విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ సమష్టి నిర్ణయంతో వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు. ఈ నెల 14 నుంచి ఎంపిక కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు.

రీ సర్వే పనులు వేగవంతం



రామారావుగూడెంలో రీసర్వే చేస్తున్న దృశ్యం

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, మండల సర్వేయర్ రమణ, అన్ని గ్రామాల్లో సర్వేయర్లు, వీఆర్ఎలు, వీఆర్వోలు సర్వే పనులను, మ్యాపింగ్ చేస్తున్నారు. రీసర్వే పనులు సకాలంలో నమోదు చేసి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తున్నారు. రామారావుగూడెంలో రీసర్వే పనులను తహసీల్దార్ నాంచారయ్య, సర్వేయర్ రమణ పరిశీలించారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: అక్రమంగా నిషేధిత కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు సీజ్ చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని వీరమ్మకుంటలో బొలేరో వాహనంలో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సోమవారం సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో వెళ్లి వాహనాన్ని అడ్డుకుని సీజ్ చేసారు. అనంతరం కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనదారుడు, డ్రైవర్, చెరువు యజమానిపైన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణ పనుల ప్రారంభం

దెందులూరు: అలుగులగూడెంలో పాత కమ్యూనిటీ హాలు స్థలంలో నూతన కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం పంచాయతీరాజ్ దెందులూరు అసిస్టెంట్ ఇంజనీర్ చౌదరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అధికారి పనులను పరిశీలించారు. పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. స్థానిక వార్డు మెంబర్ కాండ్రు ప్రసన్నరాణి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్ముల రవికుమార్ తదితరులున్నారు.

కనులపండువగా పవిత్రారోహణ



పవిత్రాలతో శోభిల్లుతున్న ఆళ్వార్‌లు



పవిత్రాలతో అలంకరించబడిన శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం పవిత్రారోహణను అర్చకులు వేడుకగా నిర్వహించారు. తొలుత యాగశాలలో ఉంచిన పవిత్రాలతో అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు ఆలయ ప్రదక్షిణలను నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ దివ్య పవిత్రాలను శ్రీనివాసుని మూలవిరాట్ పైన, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపైన ఉంచారు. అలాగే ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, ఆళ్వార్లపై ఈ పవిత్ర మాలలను వేశారు. తర్వాత ఆలయ యాగశాలలో పవిత్రాంగ హోమం, శాంతి హోమాలను ఘనంగా జరిపారు. దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవినీతికి పాల్పడిన వారికి శిక్ష తప్పదు

గణపవరం: అవినీతి చేసిన వారికి అరదండాలు వేయక పూల దండలు వేస్తారా? అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం ఆయన హైదరాబాద్ నుంచి ఫోన్‌లో విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ కుంభకోణంలో చంద్రబాబునాయుడు పాత్ర ఉన్నట్లు రుజువు దొరికినందువల్లనే సీఐడీ అరెస్టు చేసిందని, దీనితో ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు సంబంధం ఏమిటో అర్థంకావడం లేదన్నారు. చేసిన తప్పులు, అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని అన్నారు. అవినీతికి పాల్పడిన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించి తీరాల్సిందేనని, దీనికి చంద్రబాబు ఉదాహరణ అన్నారు. 40 సంవత్సరాలు తప్పించుకున్న చంద్రబాబు చివరికి చట్టానికి చిక్కారని, దీనిపై ఆయన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలే తప్ప తనను అక్రమంగా అరెస్టు చేశారని, తనపై తప్పుడు కేసులు పెట్టారని వితండ వాదనలు చేయడం తగదన్నారు. తప్పుచేసినవారు ఎంతవారైనా చట్టం ముందు దోషేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. చంద్రబాబుపై కేసు ఆయన పాలనలోనే వచ్చిందని, ఇంకా అనేక అవినీతి, అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉండటంతో తెదేపా నాయకులు బెంబేలెత్తి పోతున్నారని విమర్శించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. తణుకుకు చెందిన పరిమి నాగేశ్వరరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40-72
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-08
బెండకాయలు	18	కంద	40
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	34
కాకర కాయలు	20-24	కీరా దోస	38
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	108
క్యాబేజీ	24	అల్లం	110-200
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	18	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	06
దోసకాయలు	24-36	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	50
		నిమ్మకాయలు (డజను)	--